
సంస్కరణలకు శ్రీకారం..!



రాజీవ్‌గాంధీ 1985లో ప్రధానిగా బాధ్యతలు స్వీకరించాక... దేశ ఆర్థిక విధానాల్లో సరికొత్త మార్పులకు శ్రీకారం చుట్టారు. ప్రయివేటు రంగాన్ని ప్రోత్సహించడం.. విస్తృత పరచడం.. కొత్తవిధానం ప్రధాన ఉద్దేశంగా మారింది! ప్రయివేటురంగానికి సుహృద్భావ వాతావరణాన్ని కల్పించి... తద్వారా దేశ ఆర్థికాభివృద్ధిలో ఆ రంగం కీలక పాత్ర పోషించేలా తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావించింది. ఎగుమతి-దిగుమతి విధానం, పారిశ్రామిక లైసెన్సింగ్, సాంకేతిక పరిజ్ఞానం పెంపుదల, కోశ విధానం, విదేశీ ఈక్విటీ మూలధనం, ఆంక్షల తొలగింపు ద్వారా.. ప్రయివేటురంగంలో నూతన ఉత్తేజాన్ని నింపేందుకు కేంద్రం పలు చర్యలు చేపట్టింది!!

1991లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినపుడు భారతదేశ ఆర్థికవ్యవస్థ తీవ్ర సంక్షోభ స్థితిలో ఉంది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, ద్రవ్యలోటు తీవ్రమవడం, చెల్లింపుల శేషంలో సంక్షోభస్థితి లాంటి సమస్యలతో... ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్థ స్థితికి చేరుకుంది. ఆ పరిస్థితి అలాగే కొనసాగితే మొత్తం వ్యవస్థ ఉనికికే ముప్పు వాటిల్లేది! ఆర్థిక లోటును భర్తీచేసి.. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించి.. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడం నాడు తక్షణ కర్తవ్యమైంది. ఇందుకోసం స్వల్పకాలిక చర్యలతోపాటు నిర్మాణాత్మక సంస్కరణలను చేపట్టడం తప్పనిసరైంది. స్థూల ఆర్థిక సంతులనాన్ని కాపాడి, ప్రగతికి దోహదంచేసే నూతన విధాన నిర్ణయాలను నాటి ప్రభుత్వం తీసుకోవలసి వచ్చింది. 1991జులై నుంచి కేంద్ర ప్రభుత్వం దేశంలో ఆర్థిక సంస్కరణలను అమలుచేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అనేక రంగాల్లో ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టాయి. పారిశ్రామిక రంగం, పన్నుల వ్యవస్థ, విదేశీ వాణిజ్యం, బీమారంగం, మూలధన మార్కెట్‌లో సంస్కరణలు చేపట్టారు. సంస్కరణల ప్రక్రియ వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసిందని చెప్పవచ్చు. సంస్కరణల ప్రభావం ఆర్థికాభివృద్ధిపై వెంటనే కనిపించిందు. అది దీర్ఘకాలిక ప్రక్రియ!

స్థూల దేశీయోత్పత్తిలో(GDP) వృద్ధి:

ఆర్థిక సంస్కరణలు ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయగలవనడంలో ఎలాంటి సందేహం లేదు. సంస్కరణల ముందు కాలంలో.. 1980-81 నుంచి 1990-91 మధ్య... సగటు వార్షిక జీడీపీ రేటు 5.6% కాగా... సంస్కరణల యుగంలో.. ఒక దశాబ్ద కాలంలో.. 1990-91 నుంచి 2000-01 మధ్య.. జీడీపీ రేటు 5.6%గానే ఉన్నప్పటికీ... 2000-01 నుంచి 2005-06 మధ్య సగటున 7 శాతం వృద్ధి సాధించింది. 2006-07లో 9.6 శాతం, 2007-08లో 8.7 శాతంగా జీడీపీ నమోదైంది. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో ఏర్పడిన సంక్షోభం వల్ల.. సంస్కరణల యుగంలో మొదటి దశాబ్దకాలంలో సగటు వార్షిక వృద్ధి రేటులో పెద్దగా ప్రగతి కనిపించలేదు. 2004-05 నుంచి 2007-08 వరకు తయారీరంగ ఉత్పత్తుల్లో వృద్ధి, రుతుపవనాలు అనుకూలించడం, దేశవ్యాప్తంగా వ్యవసాయ ఉత్పత్తులు పెరగడం, రవాణారంగం, నిర్మాణరంగం ఊపుమీదుండటంతో... జీడీపీలో అధికవృద్ధి సాధ్యమైంది.

పేదరికం :

1983లో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారి సంఖ్య మొత్తం జనాభాలో 44.48 శాతం. 1990-91 నాటికి అది 35.11 శాతానికి తగ్గింది. 1983లో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న జనాభా 323 మిలియన్లు. 1990-91 నాటికి ఆ సంఖ్య 291 మిలియన్లు అయింది. 1990-91 నుంచి 1997 వరకు.. పరిశీలిస్తే... పేదరికం 35.1% నుంచి 37.23% కు పెరిగింది. 1997లో మొత్తం జనాభాలో.. 349 మిలియన్ల (37.23%) మంది దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నట్లు అంచనా. నేషనల్ శాంపిల్ సర్వే గణాంకాల ఆధారంగా(1999-2000)... దేశంలో 26.1 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువ ఉన్నట్లు ప్రణాళికా సంఘం పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో 27.09%, పట్టణ ప్రాంతాల్లో 23.62 శాతం మంది ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు. 10వ పంచవర్ష ప్రణాళికాంతానికల్లా (2007 మార్చి నాటికి) దేశంలో పేదరికాన్ని 20 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా నిర్ణయించారు. 2004-05లో నేషనల్ శాంపిల్ సర్వే ప్రకారం... గ్రామీణ ప్రాంతాలలో 28.3%, పట్టణ ప్రాంతాలలో 25.7% మంది ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం:

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2006, ఫిబ్రవరి 2న ప్రారంభమైంది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారి కుటుంబం లో ఒకరికి ఏడాదిలో 100 రోజుల పాటు ఉపాధి కల్పించడం దీని లక్ష్యం. ఈ పథకం అమలు చేయడం ద్వారాపేదల జీవన ప్రమాణాలు పెంచి,దేశంలో పేదరికాన్ని తగ్గించాలని ప్రభుత్వం భావించింది. పేదరికం తగ్గాలంటే కొన్ని అంశాల్లో విధాన పరమైన జోక్యం అవసరం. రవాణా సదుపాయాలు, విద్యుత్, విద్య, ఆరోగ్యం, వ్యవసాయ విస్తరణ కార్యకలాపాలు, లక్షిత వర్గాలకు పరపతి సౌకర్యాలను సులభతరం చేయడం, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయేతర ఉపాధి, సంక్షేమ చర్యలు తీసుకోవాలి. పేదరికం సమస్యను నివారించాలంటే.. దేశంలో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)వృద్ధిరేటు పెరిగేవిధంగా సంస్కరణలను అమలుపరచాలి. ఆర్థిక కార్యకలాపాలు విస్తృతమైనప్పుడు జీడీపీ వృద్ధిరేటు పెరుగుతుంది. ప్రభుత్వం ప్రోత్సాహక, రక్షణ విధానాలను అమలుపరచడం ద్వారా... ఆర్థిక కార్యకలాపాలు వేగవంతమయ్యేలా కృషి చేయాల్సిన అవసరముంది. 2004-05లో 300 మిలియన్ల మంది దారిద్ర్యరేఖకు దిగువన ఉండగా... 1993-94లో 320 మిలియన్ల మంది పేదరికంలో ఉన్నారు. కాని సంస్కరణల ముందు కాలంలో.. 1973-74, 1987-88 మధ్య పేదరికం 54.9% నుంచి 38.9%కు తగ్గింది. దీనిని బట్టి సంస్కరణల కాలంలో పేదరికం క్రమేణా తగ్గుతున్నట్లు చెప్పొచ్చు.

ఉద్యోగిత :

నిరుద్యోగిత, అల్ప ఉద్యోగిత, నాణ్యత గల ఉపాధి లేని స్థితి పేదరికానికి కారణమవుతోంది. ఈ నేపథ్యంలో.. సంస్కరణల యుగానికి ముందు, ఆ తర్వాత కాలంలో ఉద్యోగితాస్థితిని పరిశీలించడం ఎంతో అవసరం. 1983లో మొత్తం ఉద్యోగిత 3,026 లక్షలుగా ఉంది. అది 1990-91 నాటికి 3,568 లక్షలకు, 1997-98 నాటికి 3829 లక్షలకు 1999-2000లో 3970 లక్షలకు పెరిగింది. 1983 నుంచి 1990-91 మధ్య కాలంలో .. వార్షిక ఉద్యోగితా వృద్ధిరేటు 2.39%. ఇది ఇదే కాలానికి సంబంధించిన శ్రామికశక్తి వృద్ధిరేటుకు సమానం. సంస్కరణలు ప్రారంభమైన తర్వాత ... 1990-91 నుంచి 1999-2000 మధ్యకాలంలో.. సగటు వార్షిక ఉద్యోగితా వృద్ధి 1 శాతం మాత్రమే.

15 ఏళ్ల కాలంలో 2.4 శాతం:

9వ ప్రణాళిక తన పత్రంలో.. 1997-2002 మధ్యకాలంలో.. శ్రామికశక్తి వార్షిక వృద్ధి 2.5% ఉండగలదని.. ఆ తర్వాత 15 సంవత్సరాల కాలంలో 2.4% ఉంటుందని అంచనా వేసింది. గ్రామీణ ప్రాంతాల్లో సగటు వార్షిక వృద్ధి 1983-88 మధ్య కాలంలో 1.36 శాతం. సంస్కరణల యుగంలో (1993-94 నుంచి 1999-2000) మధ్య 0.66 శాతం మాత్రమే. పట్టణ ప్రాంతాల్లో 1983-88 మధ్య సగటు వార్షిక ఉద్యోగితా వృద్ధి 2.77%. 1993-94 నుంచి 1999-2000 మధ్య వృద్ధి 2.27% మాత్రమే.సంఘటిత రంగంలో సగటు వార్షిక ఉద్యోగితా వృద్ధి 1983-94 మధ్య 1.20% కాగా... 1994-2004 మధ్య రుణాత్మక వృద్ధి నమోదు చేసుకుంది(-0.38 శాతం). దీనిని బట్టి సంస్కరణల యుగంలో సంఘటిత రంగంలో ఉపాధి వృద్ధి సంస్కరణల ముందుకాలం కన్నా తక్కువ.

పెరిగిన నిరుద్యోగిత:

ఆర్థిక వ్యవస్థ మొత్తాన్ని తీసుకుంటే... యూజువల్ స్టేటస్ ప్రకారం నిరుద్యోగిత వృద్ధి 1993-94లో 2.62% నుంచి 1999-2000కు 2.78%కు 2004-05లో 3.1%కు పెరిగింది. రోజువారీ స్థితి ఆధారంగా నిరుద్యోగిత 1999-2000లో ఉన్న7.3% నుంచి 2004-05లో 8.3%కు పెరిగింది. ఒకవైపు ఇటీవల కాలంలో స్థూల దేశీయోత్పత్తి వృద్ధి పెరుగుతున్నప్పటికి నిరుద్యోగిత వృద్ధిలో తగ్గుదల లేనందు వల్ల సరైన ఉపాధి వ్యూహాలను అమలు పరచాలి.

ముఖ్యంగా అధిక ఉద్యోగిత కల్పించగలిగే రంగాలైన వ్యవసాయం, అనుబంధాలు, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, రిటైల్ రంగం, ఐ.టి రంగం, గ్రామీణ ప్రాంతాలలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ ఏర్పాటు చేయుట ద్వారా ఉపాధి అవకాశాలు పెంచాలి!!

ఆర్థిక సంస్కరణలు విధానపరమైన మార్పులు

నూతన ఆర్థిక సంస్కరణలు అంటే నూతన పారిశ్రామిక విధానంగానే భావించాలి. గతంలో నాలుగు దఫాలుగా అంటే 1948, 1956, 1977, 1980లలో భారత ప్రభుత్వం ఆర్థిక విధానాల తీర్మానాలు చేసింది. పంచవర్ష ప్రణాళికల ప్రధాన ధ్యేయాలైన వృద్ధిరేటు, స్వావలంబన, సంతులిత అభివృద్ధి, ఆధునీకీకరణ, సామాజిక న్యాయంతో కూడిన వృద్ధి మొదలైనవి ప్రభుత్వ ఆర్థిక విధానాలు-సంస్కరణలలోని అంతర్భాగాలే. 1948లో మొదటి పారిశ్రామిక విధాన తీర్మానం చేసిన నాటి నుంచి 1991 వరకు భారత ఆర్థిక వ్యవస్థ సుదీర్ఘ ప్రయాణం చేసింది. ఈ కాలంలో ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన ప్రణాళికల అమలు, సాధించిన విజయాలు, ఎదురైన వైఫల్యాలను బేరీజు వేసుకొని, ప్రపంచవ్యాప్తంగా వస్తున్న ఆర్థిక మార్పుల నేపథ్యంలో మరింత పటిష్టమైన చర్యల కోసం 1991లో నూతన ఆర్థిక సంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆర్థిక సంస్కరణలు అనే విధానపత్రం ద్వారా ప్రభుత్వం ప్రైవేటు రంగంలో కొనసాగించదల చిన కొత్త సంబంధాల గురించి వివరించారు. 1948లో ప్రకటించిన మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు రెండింటికి ప్రాధాన్యత ఇచ్చినప్పటికీ పారిశ్రామిక లైసెన్సింగ్, నియంత్రణ అధికారాలతో పాటు ప్రభుత్వ రంగంలోనే ఎక్కువ ప్రణాళిక వ్యయం జరిగేది.

1990 నాటి పరిస్థితులు

దేశంలో నెలకొని ఉన్న రాజకీయ అనిశ్చితి.. 11 శాతానికి పైగా పెరిగిన ద్రవ్యోల్బణం.. 80వ దశకంలో కోశపరమైన క్రమశిక్షణ (Fiscal discipline) లేకపోవడం వల్ల ఉత్పన్నమైన లోటు (Deficit).. విదేశీ సంబంధమైన చెల్లింపులలో (Balance of Payments) అసంతులిత.. ప్రభుత్వ ఆదాయాలు- ఖర్చుల మధ్య పెరుగుతున్న అగాధం.. దాని పర్యావసానంగా అంతర్జాతీయంగా భారత్ క్రెడిట్ రేటింగ్ క్షీణించడం.. మొదలైన అనేక పరిస్థితులను అధిగమించడానికి నూతన ఆర్థిక విధానాల దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

ప్రభుత్వ రంగం ఆధీనంలో నడుస్తున్న ఇన్సూరెన్సు, బ్యాంకింగ్, టెలికాం, రక్షణ రంగ ఉత్పత్తులు, మైనింగ్, పెట్రోలియం వంటి రంగాల్లో విదేశీ పెట్టుబడులను అనుమతించడం, పారిశ్రామిక నియంత్రణ పూర్తిగా సరళీకరించడం, లైసెన్సింగు రద్దు, ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణ, ద్రవ్యవిధానంలో సంస్కరణలు మొదలైనవి ఆర్థిక సంస్కరణలలో భాగమయ్యాయి.

నూతన ఆర్థిక విధానం ద్వారా ప్రైవేటు రంగం పారిశ్రామిక నేతృత్వాన్ని వహించే విధంగా ప్రభుత్వం విధానపరమైన నిర్ణయాలు చేసింది. ప్రభుత్వరంగం స్వీయ పరిమితులు విధించుకొంది. 1956లో ప్రభుత్వం మాత్రమే నిర్వహించే 17 రకాల పారిశ్రామిక ఉత్పత్తుల సంఖ్య 8 కి తగ్గింది.

అవి: 1) ఆయుధాలు, మందుగుండు సామగ్రి
2) అణుశక్తి
3) కోల్, లిగ్నైట్
4) మినరల్ ఆయిల్స్
5) ముడి ఇనుము, మాంగనీసు, క్రోమ్, జిప్సం, సల్ఫర్, గోల్డ్, డైమండ్స్, మైనింగు పనులు
6) కాపర్, లెడ్, జింకు, టిన్ మైనింగు పనులు
7) అణు ఇంధనానికి సంబంధించిన ఖనిజాలు
8) రైలు రవాణా

2001లో ఈ ఎనిమిదింటిలోనూ 5 రకాల ఉత్పత్తులకు ప్రైవేటు రంగాలను అనుమతించింది. ఆయుధాల తయారీలో కూడా ప్రైవేటు రంగానికి కొంత అనుమతి లభించింది. ప్రస్తుతం అణుశక్తి, అణు ఇంధనానికి సంబంధించిన ఖనిజాలు, రైలు రవాణా మాత్రమే కేవలం ప్రభుత్వ రంగాలుగా ఉన్నాయి.

ప్రాక్టీస్ ప్రశ్నలు

1.1991లో నూతన ఆర్థిక విధానం ప్రకటించక ముందు భారత ప్రభుత్వం, ఎన్ని సార్లు, ఏయే సంవత్సరాల్లో ఆర్థిక విధానాలు పారిశ్రామిక తీర్మానాలు చేసింది?
ఎ) 3 సార్లు, 1956, 1977, 1980
బి) 2 సార్లు, 1956, 1980
సి) 4 సార్లు, 1948, 1956, 1977, 1980
డి) ఒకేసారి, 1956

2.భారత ఆర్థిక విధానాలకు సంబంధించి కింది వాటిలో ఏది సరైంది?
ఎ) ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు రెండూ ఆర్థికా భివృద్ధిలో ప్రముఖపాత్ర వహిస్తాయి. అయినప్ప టికీ ప్రభుత్వ రంగానిదే పైచేయిగా ఉంటుంది.
బి) 1991 నుంచి ప్రైవేటు రంగానికి అధిక ప్రాముఖ్యత ఇచ్చారు.
సి) కేవలం ప్రభుత్వ రంగానికే ప్రాధాన్యత ఇచ్చారు.
డి) ఎ, బి

3.1991 నూతన ఆర్థిక విధానం రావడానికి ప్రధా నమైన అంతర్గత కారణాలు?
ఎ) విదేశీ మారకద్రవ్య నిల్వల్లో సంక్షోభం - నివారణ, బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్‌లో చెల్లింపు సమస్యలను అధిగమించడం కోసం
బి) ద్రవ్యోల్బణ ఒత్తిడులు

సి) రాష్ట్రాల నుంచి ఒత్తిడులు డి) ఎ, బి

4.1991 నూతన ఆర్థిక విధానాలు 'ప్రపంచీకరణ' రూపంలో ఏ విధంగా ప్రభావితం చేస్తాయో కింది అంశాల్లో తెల్పండి?

ఎ) భారత ఆర్థిక వ్యవస్థను ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలతో అనుసంధానం చేయడం

బి) భారత ఆర్థిక వ్యవస్థలో దిగుమతి సుంకాలు విధించడం

సి) విదేశాలకు ఎగుమతి చేసే వస్తువులపై ఆంక్షలు విధించడం

డి) ఏదీ కాదు

5.నూతన ఆర్థిక విధానం అమలుకు ముఖ్యమైన కారణం?

ఎ) ప్రభుత్వ రంగంలో ఆశించినంతగా ప్రగతి ఫలితాలు లేకపోవడం

బి) ప్రపంచ వ్యాప్తంగా ప్రైవేటీకరణ, ప్రపంచీక రణ పోకడలు

సి) ఎ, బి డి) ఎ ఒక్కటి మాత్రమే

6.IDRA (భారత పారిశ్రామిక అభివృద్ధి నియం త్రణ చట్టం)-1951 ప్రకారం 17 రకాల పరిశ్ర మల స్థాపన విషయంలో తప్పనిసరిగా ప్రభుత్వం నుంచి లైసెన్సు పొందాలి. అయితే 1991 ఆర్థిక విధానం ప్రకారం ఆ సంఖ్యను ఎంతకు తగ్గించారు?

ఎ) 6 బి) 8 సి) 5 డి) 2

7.1991 నూతన ఆర్థిక విధానం ప్రకారం ప్రభుత్వం నిర్వహించే పరిశ్రమలు 8 నుంచి 3కు కుదించారు. ఆ మూడు పరిశ్రమలు?

ఎ) రైలు రవాణా, అణుశక్తి, అణు ఇంధనానికి సంబంధించిన ఖనిజాలు

బి) ముడి ఇనుము, మందుగుండు సామాగ్రి

సి) మినరల్ ఆయిల్స్, కోల్, లిగ్నైట్

డి) జిప్సమ్, సల్ఫర్

8.1991 తర్వాత అమలుచేసే ప్రణాళికలను ఏమని పిలుస్తారు?

ఎ) సూచనాత్మక ప్రణాళికలు బి) భవిష్యత్ ప్రణాళికలు

సి) అభివృద్ధి ప్రణాళికలు డి) ఏవీ కావు

9. నూతన ఆర్థిక విధానాల్లో భా గంగా FERA-1973 చట్టం స్థాన ంలో ఏ కొత్త చట్టాన్ని తెచ్చారు?

ఎ) MRTPA చట్టం బి) FEMA చట్టం 2002 జూన్‌లో

సి) FRBM చట్టం డి) ఎ, బి

10.నూతన ఆర్థిక సంస్కరణల్లో కింది వాటిలో ఏవి ముఖ్యాంశాలు?

ఎ) ప్రభుత్వ రంగ, విదేశ వాణిజ్య విధాన సంస్కరణలు

బి) పారిశ్రామిక విధాన సంస్కరణలు

సి) ప్రైవేటీకరణ డి) పైవన్నీ

11.ఆర్థిక సంస్కరణలలో భాగంగా పెట్టుబడుల ఉపసంహరణ (డిజిన్వెస్టిమెంట్) కమిషన్ ఎవరి నేతృత్వంలో ఎప్పుడు స్థాపించారు?

ఎ) జి.వి. రామకృష్ణ, 1996 బి) శరద్ పవార్, 1992

సి) ప్రణబ్ ముఖర్జీ, 1999 డి) ఏదీ కాదు

12.ఆర్.హెచ్. పాటిల్ నాయకత్వంలో 2001లో ఏర్పాటైన కమిషన్?

ఎ) MRTP కమిషన్ బి) జనాభా కమిషన్

సి) రెండవ పెట్టుబడుల ఉపసంహరణ

డి) ఏదీ కాదు

13.విదేశీ మారకద్రవ్య నియంత్రణ చట్టాన్ని తెచ్చిన సంవత్సరం?

ఎ) 1973 బి) 1977 సి) 1980 డి) 1991

14.MRTP చట్టం-1969 ముఖ్య ఉద్దేశం

ఎ) ఆర్థిక శక్తి వికేంద్రీకరణ బి) గ్లోబలీకరణ

సి) లైసెన్సింగ్ విధానం రద్దు

డి) పెద్ద పరిశ్రమలను ప్రోత్సహించడం

15.స్పెషల్ ఎకనామిక్ జోన్ చట్టం-2005 ప్రత్యేకత?

ఎ) విదేశీ, స్వదేశీ పెట్టుబడులను ఆకర్షించడం కోసం

బి) వ్యవసాయ విస్తరణ కార్యక్రమం

సి) చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహించడం

డి) బి, సి

16.1992-93 నుంచి అమలులో ఉన్న ఫారిన్ కరెన్సీ కన్వర్టబుల్ బాండ్స్ (FCCB) ముఖ్యోద్దేశం

ఎ) భారతీయ కంపెనీలకు ఇతర దేశాల మార్కె ట్లో ఇన్వెస్ట్‌మెంట్ చేయడానికి అనుమతివ్వడం

బి) డిజిన్వెస్ట్‌మెంట్‌ను ప్రోత్సహించడం

సి) టారిఫ్‌లను రద్దు చేయడం

డి) భారత్‌లోకి విదేశీ పెట్టుబడులను ప్రోత్స హించడం

17.ఆర్థిక సంస్కరణలలో భాగంగా MRTP చట్టం లో తెచ్చిన ప్రధానమైన మార్పు?

ఎ) కంపెనీల నికర ఆస్తుల విలువను రూ. 50 కోట్లకు తగ్గించడం

బి) కంపెనీల నికర ఆస్తుల విలువను రూ. 100 కోట్లకు పెంచడం

సి) ఏకస్వామ్య కంపెనీల విస్తరణకు కంపెనీ ఆస్తుల విలువపై పరిమితులు పూర్తిగా తొలగింపు

డి) ఎ, బి

18.భారత స్టాక్ మార్కెట్లో విదేశీ సంస్థాగత పెట్టు బడులను (FII) ఎప్పటి నుంచి అనుమతించారు?

ఎ) 1992 బి) 1991 సి) 1996 డి) 1993

19.స్పెషల్ ఎకనామిక్ జోన్ చట్టం-2005 ముఖ్యోద్దేశం

ఎ) భూ యజమానులకు ఎక్కువ విలువను సమకూర్చడం

బి) సంస్కరణల్లో భాగంగా స్వదేశీ, విదేశీ ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించడం

సి) ఎగుమతుల వృద్ధి డి) ఏవీ కావు

జవాబులు	1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14	15	16	17	18	19
	C	D	A	A	C	B	A	A	D	D	A	C	A	A	A	A	C	A	B

ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు.. ఆర్థిక సంస్కరణల ప్రభావం

గ్రూప్ 2 మెయిన్స్ సిలబస్‌లో ఆర్థిక సంస్కరణల ముందు, తర్వాత ప్రభుత్వ, ప్రైవేటు రంగాల పాత్రలో వచ్చిన మార్పులు, ప్రణాళికలో ఈ రంగాల మీద వ్యయాలు ముఖ్యమైన అంశాలు. అదేవిధంగా గ్రూప్ 2 భారత ఆర్థిక వ్యవస్థ సిలబస్‌లో 1991 నుంచి ప్రధాన ఆర్థిక సంస్కరణలను కూడా దృష్టిలో పెట్టుకొని అధ్యయనం చేయాలి.

మిశ్రమ ఆర్థిక వ్యవస్థను 1948 మొదటి పారిశ్రామిక విధానం ద్వారా భారత్ ఆమోదించింది. ఒకే సమయంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు ఆర్థిక కార్యకలాపాలను చేపడతాయి. మిశ్రమ ఆర్థిక వ్యవస్థ ఒక విధంగా పెట్టుబడిదారీ, సామ్యవాద వ్యవస్థల సమ్మేళనం. ఒకే కలాపాన్ని ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తులు భాగస్వాములుగా ఉండి నిర్వహించే ఉమ్మడిరంగం (Joint Sector). ఈ భావన 1973లో దత్ కమిటీ సిఫారసుతో ప్రాబల్యానికి వచ్చింది. మొత్తం ప్రణాళికా వ్యయంలో ప్రభుత్వరంగ వ్యయం, ప్రైవేటురంగ వ్యయం ఉంటాయి. ప్రభుత్వరంగానికి సంబంధించిన వ్యయానికి ప్రణాళికల్లో ప్రభుత్వమే బాధ్యత వహిస్తుంది. ప్రైవేటు రంగానికి సంబంధించి ప్లానింగ్ కమిషన్ ప్రణాళికా వ్యయాలపై అంచనా మాత్రమే చేస్తుంది. స్వాతంత్ర్యం వచ్చే నాటికి పబ్లిక్‌రంగంలో మౌలిక వసతులైన సాగు నీటిపారుదల, ఇంధనం, రైల్వే, ఓడరేవులు, కమ్యూనికేషన్లు కొన్ని రకాల డిపార్ట్‌మెంట్లకే పరిమితమై ఉన్నాయి. తర్వాత క్రమేపీ ప్రభుత్వరంగం విస్తరించింది.

భారత ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వరంగం పాత్ర :

ప్రైవేటురంగంలో కంపెనీల పనితీరు అవి ఆర్జించే నికర లాభాలను బట్టి పరీక్షించవచ్చు. ప్రభుత్వరంగంలో ఎక్కువగా మౌలిక సదుపాయాలైన రవాణా, కమ్యూనికేషన్లు, భారీ పరిశ్రమలలో అధిక పెట్టుబడి పెట్టి లాభాల కోసం ఎక్కువ కాలం నిరీక్షించాల్సిన పరిస్థితి ఉంటుంది.

ప్రభుత్వ రంగంలోని మౌలిక సదుపాయాలు, ప్రైవేటు రంగం అభివృద్ధికి కూడా తోడ్పడతాయి. అయితే ఉత్పత్తి రంగాలైన స్టీలు, ఎరువులు మొదలైన వాటిలో లాభాలు ఆర్జించే దిశలో ప్రభుత్వ రంగ కంపెనీలు పనిచేయాలి.

మౌలిక రంగాల అభివృద్ధి :

వెనుకబడిన దేశం వేగంగా అభివృద్ధి చెందాలంటే, ఆ దేశ మౌలిక రంగాల వృద్ధి తప్పనిసరి. సరైన నీటిపారుదల, విద్యుత్, ఇంధనం వంటి వసతులు లేకుండా వ్యవసాయం కూడా అభివృద్ధి చెందలేదు. పారిశ్రామికీకరణ ప్రక్రియ నిరంతరం కొనసాగాలంటే, రవాణా, కమ్యూనికేషన్లు, యంత్ర పరికరాలు తయారుచేసే భారీ పరిశ్రమలు తప్పనిసరి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రైవేటు రంగం తమ దగ్గర వనరుల లేమి కారణంగా గానీ, ఆసక్తి లేకపోవడం వల్ల గానీ, మౌలిక రంగాలవైపు శ్రద్ధ కనపరచలేదు. అందువల్ల ప్రభుత్వమే ఈ రంగాలను అభివృద్ధి చేసే బాధ్యతను చేపట్టింది. రైలు, సముద్ర, విమాన యాన మార్గాల రవాణా వ్యవస్థను పటిష్టం చేసింది. ప్రభుత్వరంగం ద్వారా ఏర్పాటైన మౌలిక వసతులను ప్రైవేటురంగం తన వృద్ధికి కూడా ఉపయోగించుకుంది.

పటిష్టమైన పారిశ్రామిక పునాదులు :

మొత్తం జాతీయ స్థూల ఉత్పత్తుల్లో ప్రభుత్వ ఆధ్వర్యంలో పరిశ్రమల రంగం అంటే- ఉత్పత్తుల తయారీ, నిర్మాణాలు, విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా వాటా ప్రణాళికా కాలంలో నిదానంగానే పెరిగింది. 1950-51లో 13.3 శాతం నుంచి 1980-81లో 21.6 శాతం, తర్వాత 2001-02 నాటికి 24.4 శాతం, 2006-07 నాటికి 28.2 శాతానికి పెరిగింది. 1950-51నాటితో పోల్చితే నేటి భారత పారిశ్రామిక వ్యవస్థ ఎంతో పటిష్టత సాధించింది. ప్రభుత్వ రంగంలోని రక్షణ, వ్యూహాత్మక

భారతదేశంలో ప్రభుత్వ-ప్రైవేటు కంపెనీలు

సంవత్సరం	కంపెనీల సంఖ్య		పెయిడ్ అప్ క్యాపిటల్ (రూ. కోట్లలో)	
	పబ్లిక్‌రంగం	ప్రైవేటురంగం	పబ్లిక్‌రంగం	ప్రైవేటురంగం
1960-61	142 (0.5)	26,007 (99.4)	547 (30.1)	1271 (69.9)
1970-71	314 (1.0)	30,008 (99.0)	2064 (45.8)	2439 (54.2)
1980-81	851 (1.3)	64,706 (99.0)	1443 (69.9)	4914 (30.0)
1990-91	1180 (0.5)	2,49,181 (99.5)	56481 (71.6)	22415 (28.4)
2000-01	1267 (0.2)	5,41,051 (99.8)	95842 (35.8)	1,72, 056 (64.2)

పబ్లిక్, ప్రైవేటు రంగాలలో ఉద్యోగిత 2007-08 నాటికి (ఉద్యోగస్తుల సంఖ్య లక్షల్లో)

కేటగిరి	పబ్లిక్‌రంగం	ప్రైవేటురంగం
పురుషులు	150.86	63.57
స్త్రీలు	29.21	20.95
	180.07	84.52

మూలం : ఎకనామిక్ సర్వే 2007-08, ప్లానింగ్ కమిషన్ భారత ప్రభుత్వం. పై పట్టికను పరిశీలిస్తే ప్రైవేట్‌రంగంలో (84.5 లక్షలు) కన్నా ప్రభుత్వరంగంలోనే (180.07 లక్షలు) ఎక్కువ ఉద్యోగాలు లభించాయి. మహిళా ఉద్యోగుల సంఖ్య ఈ రెండు రంగాలలోనూ తక్కువగా ఉంది.

పరిశ్రమల్లో ఎంతో ప్రగతి కనిపించింది. ప్రభుత్వ రంగంలోని ఐరన్, స్టీల్, భారీ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్స్, పెట్రోలియం, సహజ గ్యాస్, కెమికల్స్, డ్రగ్స్, ఎరువులు మొదలైన పరిశ్రమలలోనూ అభివృద్ధి కనిపించింది.

ప్రభుత్వ, ప్రైవేటు రంగాల వాటా :

ప్రజల నుంచి పొదుపులను సేకరించి వాటిని ప్రణాళికల్లో పెట్టుబడి పెట్టడంలో ప్రభుత్వ రంగానికి ప్రముఖ స్థానముంది. మొదటి రెండు పంచవర్ష ప్రణాళికల మొత్తం పెట్టుబడిలో 54 శాతం ప్రభుత్వ రంగానిదే. మూడో ప్రణాళిక నాటికి ఇది 60 శాతానికి చేరుకుంది. ఐదు, ఆరు, ఏడో ప్రణాళికల్లో ప్రభుత్వరంగ వ్యయ వాటాలు 57.6, 52.9, 47.8 శాతాలుగా ప్రతిపాదించినప్పటికీ వాస్తవంగా జరిగిన వ్యయాల శాతాలు 43.3, 47.8, 45.7గా ఉన్నాయి. ఎనిమిదో ప్రణాళికలో కూడా 45.2 శాతం ప్రభుత్వ వ్యయంగా భావించిన ప్పటికీ వాస్తవంగా 34.3 శాతంగా ఉంది. తొమ్మిదో ప్రణాళికలో ఇది 33 శాతానికి తగ్గింది. పదో ప్రణాళికా కాలంలో మొత్తం 41 లక్షల కోట్ల ప్రణాళిక వ్యయంలో ప్రభుత్వ ప్రైవేటు రంగాల వాటాలు 30, 70 శాతాలుగా ఉన్నాయి. (**మూలం:** ప్లానింగ్ కమిషన్ డాక్యుమెంట్ల ఆధారంగా). మొదటి నాలుగు ప్రణాళికల్లో పబ్లిక్‌రంగం వాటా మొత్తం వ్యయంలో 50 శాతానికి పైగా ఉంటే ప్రైవేటు రంగానిది 50 శాతానికి తక్కువగా ఉంది. ఐదు నుంచి పదో ప్రణాళికలలో ప్రైవేటు రంగం శాతం ప్రణాళిక వ్యయంలో పెరుగుతూ వచ్చింది. దీనికి కారణం 1991 నూతన ఆర్థిక విధానంలో ప్రకటించిన ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ (Disinvestment Process).

ప్రాంతీయ అసమానతల తొలగింపు :

స్వాతంత్ర్యం రాకముందు ముంబాయి, కోల్‌కత్తా, చెన్నై ప్రాంతాలలో పరిశ్రమలు బాగా అభివృద్ధి చెందాయి. అయితే 1951లో ప్రణాళికలు మొదలైన తర్వాత దేశంలో అన్ని ప్రాంతాల మధ్య పారిశ్రామిక సమ న్వయ అభివృద్ధిని సాధించాలని ప్రభుత్వం విధాన నిర్ణయం తీసు కుంది. ప్రభుత్వ రంగ పెట్టుబడులు చాలావరకు వెనుకబడిన రాష్ట్రా లైన బీహార్, ఒరిస్సా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లలో 1990-91 వరకు రూ. 40,721 కోట్లు అంటే 35.3 శాతం ఖర్చు చేసారు. ప్రధాన ఉక్కు కర్మాగారాలు - భిలాయ్, రూర్కెలా, దుర్గాపూర్, బొకారాలలో స్థాపించారు.

దిగుమతి ప్రత్యామ్నాయాలు - ఎగుమతుల ప్రోత్సాహం

అభివృద్ధి చెందుతున్న దేశాలు తరచూ విదేశీ మారకద్రవ్య నిల్వల సమస్యలను ఎదుర్కొంటున్నాయి. దిగుమతి చేసుకుంటున్న వస్తువులను స్వదేశీ ఉత్పత్తుల ద్వారా సాధించుకోవడం, దానికి కావలసిన పారిశ్రామిక సామర్థ్యాన్ని సమకూర్చుకోవడం ఆర్థిక వ్యవస్థకు అత్యంత కీలకం.

బి.హెచ్.ఇ.ఎల్, భారత ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ఐ.ఓ.సి(ఇండియన్ ఆయిల్ కంపెనీ) ఓ.ఎన్.జి.సి మొదలైన ప్రభుత్వరంగ సంస్థలను ఈ కోణం నుంచి చూస్తే చాలా ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయి. అదే విధంగా ఎగుమతుల వృద్ధిలో ప్రభుత్వరంగ సంస్థలైన హిందుస్థాన్ లిమిటెడ్, హిందుస్థాన్ మెషిన్ టూల్స్ లిమిటెడ్, భారత ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ఎం.ఎం.టి.సి (MMTC) కీలక పాత్ర వహిస్తున్నాయి.

ఆర్థిక శక్తి కేంద్రీకరణ నిరోధించడం :

అయిదున్నర దశాబ్దాల ప్రణాళిక చరిత్రలో ప్రభుత్వరంగం ఒక మోడల్ ఉత్పత్తిదారుడు లేదా పారిశ్రామికవేత్తగా తనదైన పాత్రను పోషించింది. ఆర్థిక వ్యవస్థలోని అసమానతలు కొంతమేరకైనా తగ్గించ డంలో, ప్రైవేట్‌రంగం శ్రామికుల పట్ల, వినియోగదారుల పట్ల నైతిక, చట్టబద్ధమైన బాధ్యతను వహించే విధంగా అవసరమైన నియంత్రణ విధానాలను రూపొందించింది. ప్రభుత్వరంగ పరిశ్రమల ద్వారా వచ్చిన లాభాలను ప్రజాసంక్షేమ కార్యక్రమాలకు వెచ్చిస్తూ పేద ప్రజలను ఆదుకుంటోంది. ప్రభుత్వరంగం తన విచక్షణా ధికారం ద్వారా చిన్న ఉత్పత్తిదారులకు కావలసిన మెటీరియల్స్‌ను తక్కువ ధరకే సప్లై చేయడం, శ్రామికులకు తగిన వేతనాలు చెల్లించడం, మాస్ ప్రొడక్షన్‌కు సంబంధించిన ముడి పదార్థాలను సమకూర్చటంలో ప్రభుత్వ రంగం ఇతోధికంగా కృషిచేసింది.

నోట్ : బ్రాకెట్లలోని సంఖ్యలు మొత్తం కంపెనీల సంఖ్యలో, మొత్తం చెల్లించిన మూలధనంలో శాతాలు.

మూలం : ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్, హైదరాబాద్ వివిధ రికార్డుల నుంచి.

పట్టిక: 2ను పరిశీలిస్తే దేశంలో ప్రభుత్వరంగంలో కన్నా ప్రైవేటు రంగంలోనే ఎక్కువ కంపెనీలు ఉన్నాయి. అయితే 2001 నాటికల్లా ప్రభుత్వ రంగంలో ఉన్న 1267 కంపెనీలు (మొత్తం కంపెనీలలో 0.2 శాతం)లో 35.8 శాతం చెల్లించిన మూలధనంగా (paidup capital) రూ. 95,842 కోట్లు ఉంటే, 62.2 శాతం (రూ. 1,72,056 కోట్లు) మూలధన పెట్టుబడి ప్రైవేటు రంగంలో ఉంది. ప్రభుత్వరంగ కంపెనీలు 1961-2001ల మధ్య 9 రెట్లు పెరిగాయి. అదేకాలంలో ప్రైవేటు కంపెనీలు 21 రెట్లు పెరిగాయి.

కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు

మొత్తం ప్రభుత్వ కంపెనీలలో, కేంద్రప్రభుత్వ కంపెనీలు 10 శాతం అయినప్పటికీ పెయిడ్ అప్ మూలధనంలో 90 శాతం కలిగి ఉన్నాయి. 1951లో కేవలం 5 పబ్లిక్ రంగ కంపెనీలు రూ.29 కోట్ల మూలధనంతో మాత్రమే ఉంటే, 1991 నాటికి 246కు సంస్థల సంఖ్య పెరిగి రూ.1,13,896 కోట్ల మూలధనానికి చేరుకుంది. 2001 నాటికి పని చేస్తున్న కేంద్ర ప్రభుత్వ రంగ కంపెనీలు 234 ఉంటే, మూలధనం మాత్రం రూ.3,30, 649 కోట్లు పెరిగింది.

ప్రణాళికా కాలంలో కేంద్ర ప్రభుత్వ కంపెనీల విస్తరణ గణనీయంగా పెరిగింది.

సంస్కరణలు.. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు

గ్రూప్ 1, 2 సిలబస్‌లో ''భారత దేశంలో నూతన ఆర్థిక సంస్కరణలు'' అత్యంత ప్రాధాన్యం గల అంశం. ఆర్థిక సంస్కరణలకు ముందు, తరవాత పరిణామాలు, పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ వీటిలో ముఖ్యమైనవి. కాబట్టి అభ్యర్థులు వీటిపై దృష్టి సారించాలి.

ఆర్థిక సంస్కరణలకు ముందు (1948-1980)

భారత మొదటి పారిశ్రామిక విధాన తీర్మానం 1948 ప్రకారం ప్రభుత్వ-ప్రైవేటు రంగాలు రెండూ దేశ ఆర్థికాభివృద్ధిలో ప్రముఖ పాత్ర వహించాలని ప్రభుత్వం అంగీకరించింది. అయితే ప్రైవేటు రంగం ప్రభుత్వ నియంత్రణ పరిమితులకు లోబడి పనిచేయాల్సి ఉంటుందని పేర్కొంది. ఇందుకోసం 1951లో ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ రెగ్యులేషన్ చట్టాన్ని తీసుకొచ్చి ప్రైవేటురంగంలోని పరిశ్రమల విస్తరణ, అనుమతులు (లైసెన్సింగు) అధికారాలను ప్రభుత్వం తనకే సంక్రమింపజేసుకుంది.

1948లో రూపొందించిన మొదటి పారిశ్రామిక విధానం ప్రకారం పరిశ్రమలను నాలుగు కేటగిరీలుగా వర్గీకరించారు. మొదటి కేటగిరీ పరిశ్రమలైన అయుధాల తయారీ, అణుఇంధనం, రైలు రవాణా, కమ్యూనికేషన్లను ప్రభుత్వ ఏకస్వామ్య పరిశ్రమలుగా ప్రకటించారు. వీటిలో ప్రైవేట్ రంగానికి అనుమతినివ్వరు. ఈ కేటగిరి పరిశ్రమలనే 1956 పారిశ్రామిక విధాన తీర్మానంలో షెడ్యూల్ 'A' (కేంద్ర ప్రభుత్వం మాత్రమే నిర్వహించే పరిశ్రమలు)గా ప్రకటించారు. 1948 ఆర్థిక తీర్మానం మేరకు ప్రకటించిన రెండో కేటగిరి పరిశ్రమల్లో బొగ్గు, ఇనుము, ఉక్కు, విమానాల తయారీ, షిప్ బిల్డింగ్, టెలిఫోన్, టెలిగ్రాఫ్, వైర్‌లెస్ మొదలైనవి ఉన్నాయి. ఈ రంగాల్లో భవిష్యత్తులో రాబోయే ఉత్పత్తులను ప్రభుత్వ సంస్థలే చేపడతాయి. కేటగిరి మూడులో ప్రభుత్వం నేరుగా నియంత్రించే 18 రకాల పరిశ్రమలు (Government Controlled Industries) - ఆటోమొబైల్స్, భారీ రసాయనాలు, ఎరువులు, చక్కెర, పేపరు, సిమెంట్, కాటన్ మొదలైనవి ఉన్నాయి. ప్రజావసరాల దృష్టితో వీటిని నియంత్రిస్తారు. 1948 విధాన తీర్మానంలోని కేటగిరి II, IIIలు, 1956 విధానంలోని షెడ్యూల్ 'B' లో పేర్కొన్న పరిశ్రమలతో సారూప్యత కలిగి ఉంది. ఈ తరహా పరిశ్రమల్లో ఉత్పత్తి, నిర్వహణ, నియంత్రణల్లో ప్రభుత్వానిదే పెత్తనం. ప్రైవేటు రంగానికి ఈ పరిశ్రమల్లో అనుమతులు ఇచ్చినప్పటికీ వాటిని తర్వాత ప్రభుత్వపరం చేసుకునే వీలుంది. అంటే ఈ పరిశ్రమల స్థాపనలో, అభివృద్ధిలో ప్రైవేటురంగానిది సహాయకారి పాత్ర (Supplementary Role) మాత్రమే. 1948 పారిశ్రామిక తీర్మానం ప్రకారం కేటగిరి 4, 1956 ప్రకారం షెడ్యూల్ 'C' పరిశ్రమలు (మిగతా కేటగిరిలలో పేర్కొననివి) పూర్తిగా ప్రైవేటు కంపెనీలు, వ్యక్తులు, సహకార సంస్థలకు కేటాయించారు.

1956 పారిశ్రామిక విధాన తీర్మానంలో ప్రభుత్వరంగాన్ని ఇంకా విస్తృతపరచాలని, కొన్ని ప్రైవేటు కంపెనీల చేతిలో ఆర్థిక శక్తి కేంద్రీకృతం కాకుండా కట్టడి చేయాలని భావించారు. ఇందుకోసం 1969లో మోనోపోలీ అండ్ రెస్ట్రిక్టివ్ ట్రేడ్ ప్రాక్టీస్ ఆక్ట్ (MRTP Act) చట్టాన్ని తీసుకు వచ్చారు. ఈ చట్టం ప్రకారం కంపెనీ నికర ఆస్తుల విలువ రూ. 20 కోట్లకు మించితే, అదనపు లైసెన్సు ఇవ్వరు. 1985 నాటికి ఈ పరిమితిని రూ. 100 కోట్లకు పెంచారు. 1977 పారిశ్రామిక విధాన తీర్మానం ప్రకారం ప్రభుత్వరంగాన్ని మరింత విస్తృతపరచాలని భావించారు. ప్రభుత్వరంగం కేవలం కొన్ని కీలక వస్తువులకు ఉత్పత్తిదారునిగా మాత్రమే కాకుండా, ప్రజలకు అవసరమైన అనేక నిత్యావసర వస్తువులను సరఫరా చేయాలని భావించారు. ప్రభుత్వ రంగం ఒక పక్క విస్తరిస్తూ, చిన్న తరహా పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక, యాజమాన్య నిర్వహణలో తోడ్పడాలని కూడా నిర్ణయించారు.

1980లో నూతన పారిశ్రామిక విధానంలో పబ్లిక్‌రంగం ద్వారా ఆశించిన ప్రగతి కనిపించలేదు. అనేక ప్రభుత్వ కంపెనీలు నష్టాల బాటలో నడవడం గమనించిన ప్రభుత్వం ఈ రంగాన్ని పునరుద్ధరించడానికి వీటి యాజమాన్య నిర్వహణ సామర్థ్యంపై దృష్టి సారించింది. ప్రభుత్వ అనుమతి లేకుండా ఏర్పాటైన ప్రైవేటు కంపెనీల లైసెన్సింగు కెపాసిటీని రెగ్యులరైజేషన్ చేయాలని నిర్ణయించారు.

ఆర్థిక సంస్కరణల తర్వాత (1991-2007)

1991లో ప్రభుత్వం ప్రకటించిన నూతన ఆర్థిక విధానం ప్రైవేటు రంగం పారిశ్రామిక నేతృత్వం వహించేవిధంగా ఉంది. అనేక ప్రభుత్వ కంపెనీలు తమ పెట్టుబడులపై లాభాలు ఆర్జించడంలో విఫలమ

భారత దేశంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలోని కంపెనీల సంఖ్య, మూలధన పెట్టుబడులు

సంవత్సరం	కంపెనీల సంఖ్య		చెల్లించిన మూలధనం (రూ. కోట్లలో)	
	ప్రభుత్వ రంగం	ప్రైవేటు రంగం	ప్రభుత్వ రంగం	ప్రైవేటు రంగం
1960-61	142(0.5)	26000(99.4)	547(30.1)	1271(69.9)
1970-71	314(1.0)	30008(99.0)	2064(45.8)	2439(54.2)
1980-81	851(1.3)	64706(99.0)	11443(69.9)	4914(30.0)
1990-91	1180(0.5)	249181(99.5)	56481(71.6)	22415(28.4)
2000-01	1267(0.2)	541051(99.8)	95842(35.8)	172056(64.2)

Source : Statistical outline of India (Mumbai), various issues

య్యాయి. అందువల్ల ఈ కంపెనీల నిర్వహణ ప్రభుత్వానికి భార మైంది. గతంలో ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకున్న ఖాయిలా పరిశ్రమల్లో 1/3వ వంతు కంపెనీలు నష్టాల బాట పట్టాయి. ప్రభుత్వ టేకోవర్ల వల్లనే నష్టాలు వచ్చినట్లు తేలింది.

పలచబడ్డ ప్రభుత్వరంగం (Dilution of Public Sector)

1991 నూతన ఆర్థిక విధానం ప్రకారం ప్రభుత్వ రంగం స్వీయ పరిమితులు విధించుకుంది. భవిష్యత్తులో కింది ప్రధాన రంగాలలో తనవంతు పాత్రగా ప్రకటించుకుంది. అవి :

- కీలక మౌలిక రంగాల వస్తువులు/సేవలు
- ఆయిల్, ఖనిజ వనరుల అన్వేషణ, ఉత్పత్తి
- దీర్ఘకాలిక అభివృద్ధి సాధించడానికి అవసరమైన ఉత్పాదకతా సామర్థ్యం, టెక్నాలజీ రంగాలలో పెట్టుబడులు
- దేశ రక్షణకు అవసరమైన తయారీ, యుద్ధ సామగ్రి

గత ఆర్థిక విధానాల(పారిశ్రామిక తీర్మా నాలు)తో పోలిస్తే అనేక రంగాల నుంచి ప్రభుత్వం తప్పుకుంటున్నట్లు తెలుస్తోంది. 1956 లో ప్రభుత్వ ఆధ్వర్యంలో 18 రకాల పారిశ్రామిక ఉత్పత్తులు ఉండేవి. 1991 నాటికి ఎనిమిది రకాల కంపెనీలను మాత్రమే ప్రభుత్వం నిర్వహించే పరిశ్రమలుగా ప్రకటించుకుంది. అవి :

- ఆయుధాలు, మందుగుండు సామగ్రి
- అణుశక్తి
- కోల్, లిగ్నైట్
- మినరల్ ఆయిల్స్
- ముడి ఇనుము, మాంగనీసు, క్రోమ్, జిప్సమ్, సల్ఫర్, గోల్డ్, డైమండ్స్, మైనింగ్ కార్యక్రమాలు
- కాపర్, లెడ్, జింక్, టిన్ మైనింగ్ పనులు
- అణు ఇంధనానికి సంబంధించిన ఖనిజాలు
- రైలు రవాణా

ప్రభుత్వరంగ కంపెనీల బోర్డులకు స్వయం ప్రతిపత్తిని కల్పించడం, ప్రభుత్వ కంపెనీలలోని ఈక్విటీ వాటాలను సాధారణ ప్రజలకు, కంపెనీ కార్మికులకు, ఆర్థిక విత్త సంస్థలకు, మ్యూచువల్ ఫండ్లకు కేటాయించడం, ఖాయిలాపడ్డ పబ్లిక్ రంగ సంస్థలను బోర్డ్ ఆఫ్ ఇండస్ట్రియల్, ఫైనాన్షియల్ రీకన్‌స్ట్రక్షన్ (BIFR) ద్వారా పునరుద్ధరించటం వంటి చర్యలను నూతన ఆర్థిక సంస్కరణల్లో భాగంగా చేపట్టారు.

ముఖ్యాంశాలు

- దేశ ఆర్థికాభివృద్ధిలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల పాత్ర
- 1948లో రూపొందిన మొదటి పారిశ్రామిక విధానం
- పరిశ్రమల విభజన

పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ

నూతన ఆర్థిక సంస్కరణల్లో పెట్టుబడుల ఉపసంహరణ (Disinvestment) ప్రక్రియ ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. దశల వారీగా పారిశ్రామిక రంగం నుంచి నిష్క్రమిస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

అనేక పబ్లిక్ రంగ కంపెనీలు పెట్టుబడుల మీద ఆశించిన ఆదాయాలు సాధించలేకపోవడం ప్రభుత్వానికి అవి సమస్యగా మారడం నూతన ఆర్థిక విధానం గమనించింది. ఇందుకోసం ప్రభుత్వరంగ కంపెనీలను మూడు రకాలుగా వర్గీకరించారు.

- ప్రాధాన్యతపరంగా రిజర్వు అయి మంచి లాభాలబాటలో సమర్థవంతంగా నడుస్తున్న సంస్థలు
- ప్రస్తుతం నిర్వహణ, ఆదాయాల విషయాలలో కొంతమేరకు ఒడిదుడుకులు ఉన్నప్పటికీ, వీటి పనితీరు భవిష్యత్తులో బాగుపడే అవకాశం ఉన్న సంస్థలు (వీటిని ప్రోత్సహించి కొనసాగించడం).
- పూర్తిగా నష్టాలు చవిచూస్తూ తిరిగి పునరుద్ధరించడానికి అవకాశం లేని సంస్థలు (వీటిని మూసివేయడం లేదా ప్రైవేటు యాజమాన్యాలకు అప్పజెప్పడం).

వ్యూహాత్మకం కాని (nonstrategic) ప్రభుత్వ రంగ సంస్థల్లో తన ఈక్విటీ వాటాను 26 శాతానికి లేదా అంతకన్నా తక్కువకు తగ్గించడం, లేదా తన ఈక్విటీ వాటాను ప్రైవేటు రంగానికి అమ్మివేయడం మొదలైనవి Disinvestment కిందకు వస్తాయి. అయితే 1990లో ఈ ప్రక్రియను ప్రభుత్వరంగ సంస్థల్లో సంస్కరణలు అని భావించినప్పటికీ ఎక్కువ గా ఈక్విటీ ఉపసంహరణ మొత్తాన్ని బడ్జెట్ లోటును కప్పిపుచ్చడానికే వినియోగించారని విమర్శకులు అంటున్నారు.

పబ్లిక్ రంగం సంస్కరణలలో భాగంగా యాజమాన్య పనితీరు మెరుగుదల, స్వచ్ఛంద పదవీ విరమణ, స్వయం ప్రతిపత్తి అంశాలు ప్రధానంగా ఉన్నప్పటికీ సంస్కరణలు ఎక్కువగా ప్రభుత్వ కంపెనీల ఈక్విటీ వాటాలను అమ్ముకోవడం పైనే దృష్టి సారించినట్లు వ్యక్తమవుతోంది. 1991 నుంచి 2001-02 వరకు రూ.26,139 కోట్లు Disinvestment జరగగా, 2007 నాటికి రూ.78,000 కోట్లకు సాధించాలని పదో ప్రణాళికలో నిర్ణయించారు.

నెరవేరని డి.ఐ. లక్ష్యాలు

- D.I. (Disinvestment) ప్రక్రియను ప్రభుత్వం తొందరపాటుగా సరైన ప్రణాళిక లేకుండా చేపట్టింది.
- D.I. చేపట్టడానికి ముందు అనువైన పరిస్థితులు ఏర్పరచుకోలేదు. ప్రభుత్వ కంపెనీలోని ఈక్విటీని అమ్మాలని నిర్ణయించుకొనే ముందు, ప్రభుత్వ కంపెనీల షేర్లను స్టాక్ మార్కెట్‌లో సరైన పద్ధతిలో లిస్టింగ్ చేయలేదు. క్యాపిటల్ మార్కెట్‌లోనూ, స్టాక్ ఎక్స్చేంజితోనూ ప్రభుత్వ రంగ కంపెనీలను సరైన అనుసంధానం చేయలేదు.

అయితే Disinvestment ప్రక్రియ అవసరమా? అన్న సందేహాలు లేకపోలేదు. 1993-94 నుంచి 2001-02 మధ్య ప్రభుత్వరంగం కంపెనీల పనితీరు గతంతో పోలిస్తే మంచి ఫలితాలు సాధించాయి.

మొత్తం దేశంలోని 234 ప్రభుత్వ కంపెనీలలో 104 పబ్లిక్‌రంగ కంపెనీల పనితీరు ఎక్స్‌లెంట్, 25 సంస్థల్లో వెరిగుడ్, 15 సంస్థల విషయంలో 'గుడ్' అని రేటింగు సాధించాయి. అంటే 234 సంస్థల్లో 104 సంస్థలు మంచి పనితీరును ప్రదర్శించినప్పుడు, వీటిని ప్రోత్సహించి Disinvestment ప్రక్రియ నుంచి మినహాయించాలని సూచించారు.

మొత్తం మీద పరిశీలిస్తే నూతన ఆర్థిక సంస్కరణలు మంచి ఫలితాలే ఇస్తున్నాయని చెప్పుకోవచ్చు. ఆర్థిక సంస్కరణలు చేపట్టిన తర్వాత ప్రైవేటురంగం అభివృద్ధికి పెద్దపీట వేయడమే కాకుండా, ప్రభుత్వరంగ కంపెనీల పనితీరులో మంచి పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. అందువల్ల ప్రభుత్వం చేపట్టిన Disinvestment ప్రక్రియ ఒకరకంగా ప్రభుత్వ ధనాన్ని ఆదాచేసి దానిని విద్య, ఆరోగ్యం, తాగునీరు మొదలైన సామాజిక అవసరాలకు (Social goods or needs) వెచ్చించి దేశంలోని మానవ వనరుల వికాసానికి ఉపయోగపడుతోంది.